# మనోరంజితం - 6

''నువ్వెంత తెలివి తక్కువగా మాట్లాడుతున్నావో నీకు తెలియటంలేదు. నీకో చిన్న ఉదంతం చెప్పాలి. వింటావుగా...?''

ఏమిటన్నట్లు చూస్తూనే ''కథా...?'' అనడిగాడు తల్లిని.

''కాదు... నిజంగా జరిగిందే... భగవతి అనే ఆమెకు ఏడుగురు కూతుళ్ళు...'' మధ్యలోనే అడ్డం వచ్చి అభిరామ్ ''ఆవిడ... నీ స్నేహతురాలా... చూశావా... ఆవిడెంత తెలివతక్కువగా ప్రవర్తించిందో....!

''పూర్తిగా వినకుండానే నీకంత కంగారెందుకురా, అలా మధ్యలోనే అడ్డం వచ్చేస్తావు... చివరివరకూ విను... అపుడు నేనేం చెప్పాలనుకుంటున్నానో తెలుస్తుంది. ఆవిడేం నా స్నేహితురాలు కాదు... రోజూ పేపరు చూస్తుంటాగా, ఒక వార్తాకథనం అన్నమాట!

''సరే... కానియ్ అమ్మా... నేను మధ్యలో ప్రశ్నలు వేస్తూ నీకు అడ్డంరానులే... చివరకు ఏం నీతి పాఠం చెబుతావో... చూస్తాలే...!'' అన్నాడు సరదాగా. దాంతో మనోరమా సరదాగానే చెప్పుకుపోయింది.

''ఆవిడ ఏడుగురు అమ్మాయిలను కనటానికి కారణం... తన అత్తగారట! పైగా ఆవిడ ఉద్దేశ్యం... అంతటితో ఆపకుండా ఇంకా అబ్బాయి కోసం ఎదురుచూడమని కాబోలు... ఏడుగురు ఆడపిల్లలైనా ఒక్క అబ్బాయికి సమం కాదంటూ సెలవిచ్చిందట! ఆవిడ కొడుకు ఆ మాటతో తల్లి అభిప్రాయం అర్థమై... భార్యకి కష్టం కలిగించకూడదనే సదుద్దేశంతో వేరే వెళ్ళిపోయాడట... అంటే తల్లిపెత్తనం నుండి బయటకు వచ్చేశాడు! కొందరు ఆడవాళ్ళకు కూడా ఆడవాళ్ళ సమస్యలు, కష్టాలు అర్థం కావేమో...!

అతనేదో చిన్న దుకాణం పెట్టుకుని పిల్లల్ని పెంచి చదువులూ చెప్పించాడు. ఇంతలో అనారోగ్యంతో అతను కన్నుమూస్తే... ఏం చేయాలో పాలుపోని అతని భార్య ఆడపిల్లల సాయంతో మసాలా దినుసులు అమ్మే వాళ్ళ దుకాణాన్ని కొనసాగించాలని అనుకుందట! అపుడు అత్తగారూ వాళ్ళ బంధువులూ అంతా అది ఆడవాళ్ళ పని కాదంటూ వ్యతిరేకించినా ఆమె లక్ష్యపెట్టలేదు. వాళ్ళు అందరూ కలిసి ఆ సుగంధ ద్రవ్యాలతో ఘుమఘుమలాడే చాయ్‌నీ ప్రవేశపెట్టి, అంతర్జాతీయ ఖ్యాతిని పొందటమే కాదు, ఆర్థికంగానూ బలపడ్డారు...!''

మనోరమ ముగించినట్లుగా ఒక క్షణం నిశ్శబ్దంగా ఉండేసరికి అభిరామ్ ''నువ్వు చెప్పటం పూర్తయినట్లుందిగా అమ్మా... ఇక నేనూ మాట్లాడవచ్చుకదా... నువ్విది చెప్పటం ద్వారా నేను తెలుసుకోవలిసింది ఏమిటీ... నేను.. అప్పులపాలై అర్థాంతరంగా తనువు చాలించినా, కూతుళ్ళు ఇద్దరూ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోగలరనా...?'' అనడిగాడు.

మనోరమ తలెత్తి అతనివైపు కొంచెం తీక్షణంగా చూసింది.

ఆమె భావం అర్థమై… అభిరామ్ కొంచెం సర్దుకుని ''పోనీ, అలా కాదనుకో, వాళ్ళు ఆర్థికంగా నిలదొక్కుకుంటే సరిపోతుందా…? వాళ్ళందరికీ పెళ్ళిళ్ళు చేసేసరికి… ఆవిడ జీవితం కడతేరిపోదూ… అదే మగపిల్లలైతే… నిశ్చింతగా ఆ బాదరబందీ గురించి పట్టించుకోకుండా ప్రశాంతంగా ఉంటారుగా…!'' అన్నాడు.

ఈ సారి నిరంజన్ కల్పించుకున్నాడు. ''మీ అమ్మ చెప్పిన సంగతి విన్నాక నీకు అలా అర్థమైందా…? ఆడపిల్లలైనా మగపిల్లలైనా సమానమే ననుకుని అలాగే పెంచితే, వాళ్ళ జీవితాల్ని వాళ్ళే తమకు నచ్చిన రీతిలో నడిపించుకోగల శక్త సామర్థ్యాలను సంపాదించుకోగలరని…!''

''నాకు బుద్ధి తెలిసినప్పటినుండీ, మీరు ఒక్కసారైనా నన్ను సమర్థించారా… ఇపుడు ఇలా కాక ఇంకెలా మాట్లాడతారూ…!'' అంటూ విసురుగా అభిరామ్ బయటకు వెళ్ళిపోయాడు.

నిట్టూరుస్తూ నిరంజన్‌రావూ అక్కడనుండి లేచి లోపలకు వెళ్ళిపోయాడు.

మహిమా, మనోరమా ఇద్దరూ నిర్ఘాంతపోతూ కాసేపు అలాగే మాటామంతీ లేకుండా కూర్చుండిపోయారు. వసుధ పిలుపు వినిపించి మహిమ లేచి లోపలకు వెళ్ళింది.

వసుధకు అన్నం పెట్టి… పడుకోబెట్టింది. వసుధ పక్కనే కూర్చుని జోకొడుతుంటే… వసుధ మెల్లగా తల్లిని అడిగింది. ''అమ్మా… ఇపుడు నాన్న ఎక్కడికి వెళ్ళారూ…?''

''నీకు… స్వీట్స్, బిస్కట్స్…. ఏవో తేవాలనుకుని వెళ్ళారు. నువ్వు పడుకో… తొందరగానే వచ్చేస్తార్లే…!'' అంది మహిమ నిర్లిప్తంగా.

''అమ్మా… నాకవేమీ వద్దు… నాన్నని మునుపటిలా ఇంట్లోనే ఉండమని చెప్పవూ… చక్కగా మునుపటిలా కథలు చెప్పుకుంటూ పడుకుందాం…'' అంది.

మహిమ కళ్ళు చెమర్చాయి.

''నాన్నకు… బయట బోలెడన్ని పనులుంటున్నాయమ్మా… అవన్నీ చూసుకుని వచ్చేసరికి పొద్దుపోతోంది… నువ్వు పెందరాళే లేచి స్కూలుకి వెళ్ళాలి కాబట్టి… తొందరగా నిద్రపోవాలి మరి! తాతయ్య, నానమ్మ నీకు ఎన్నో చక్కని కథలు చెబుతున్నారూ, నీతో బాగా ఆడుకుంటున్నారు కూడా కదా…!'' అంది అనునయంగా.

''అయినా సరే, నాకు నాన్నకూడా కావాలి…'' అంది మారాం చేస్తున్నట్లుగా బుంగమూతి పెట్టి.

''మరి… నువ్వే… ఈ మాటని అడగవచ్చుకదా…?''

‘‘అమ్మో... నాన్నని చూస్తుంటే... నాకు... కొంచెం భయమేస్తోంది... మొన్ననేం... నాన్న దగ్గర కూర్చుంటే... బాడ్ స్మెల్ వచ్చింది. అడిగితే గట్టిగా కేకలేసారు... తెలుసా...?’’ అంది మెల్లగా ఆగి ఆగి చెబుతూ.

మహిమ నిర్ఘాంతపోయింది. పాప మాటలకు ఏం సమాధానం చెప్పాలో తోచలేదు కూడా. అలాగే కాసేపు కూర్చుండిపోయింది. నిద్రపోయిన వసుధకు దుప్పటి కప్పి... ముందు హాలులోనే కూర్చుని ఉన్న మనోరమ పక్కన నిశ్శబ్దంగా తనూ కూర్చుంది.

భోజనం ఏదో అయిందనిపించుకున్న నిరంజన్ వాళ్ళతో ‘‘వాడెప్పటికి వస్తాడో, ఏమో... మీరిద్దరూ ఎందుకలా ఎదురుచూస్తున్నట్లు కూర్చోవటం...? ఏదో కాస్త తిని పడుకోండి...” అని చెప్పి గదిలోకి వెళ్ళిపోయాడు.

మనోరమ ఏం బదులు చెప్పలేదు. కదలలేదు. మహిమకూ ఏం తోచక అలాగే తనూ కూర్చుంది. ఎప్పటికో ఇంటికి చేరిన అభిరామ్ ముందుగదిలోనే కూర్చుని వున్న వాళ్ళని ఒక క్షణం నిర్ఘాంతపోతూ చూసి, తల్లి పక్కనే కూర్చుని.... ‘‘నువ్వెందుకమ్మా ఇలా కూర్చున్నావు...? ఫ్రెండ్‌తో పార్టీ ఉందని చెప్పటం మరిచిపోయాను... నేను చేసే వచ్చాను. మీరు చేయకపోతే, ఇపుడైనా ఇక తినండి...’’ అన్నాడు.

మనోరమ ఏం మాట్లాడకుండా లేచి నిలబడి అతని వైపు ఒకసారి నిరసనగా, నిర్లిప్తంగా చూసి లోపలకు వెళ్ళిపోయింది.

మెల్లగా గదిలోకి వెళ్ళిన అభిరామ్ వెనకే వెళ్ళిన మహిమ ‘‘వసూకూడా మీకోసం ఎదురుచూసి... చూసీ నిద్రపోయింది...!’’ అని చెప్పింది.

‘‘ఇదంతా కావాలని నువ్వే చేస్తున్నావు...’’ అంటూ అభిరామ్ పక్క మీదవాలిపోయాడు.

తను చేసిందేమిటో మహిమకు అర్థంకాలేదు. ఒక క్షణం ఆలోచించాక ‘తాగిన వాళ్ళ మాటలకు అర్థాలు వెతకటం అనవసరం...’ అనుకుంటూ నిట్టూర్చి... నిద్రపోవటానికి ప్రయత్నించింది.

* * *

మరునాడు మహిమతో మనోరమ అంది ‘‘తను అనవసరంగా కల్పించుకుని మాట్లాడినందువల్లే అభి కోపంగా బయటకు వెళ్ళాడని ఆయన బాధపడ్డారు... ‘అదేం లేదు... నేనే ఏదో చెప్పి కోపం తెప్పించానని’ సర్ది చెప్పాననుకో. కానీ... అభి ఇలా నా కారణంగా తాగి వస్తాడని అనుకోలేదు...’’

మహిమ నిట్టూర్చింది. ‘‘మీరు... ఆడపిల్లలగురించి అలా మాట్లాడినందుకు... కోపంగా తాగి వచ్చారని అనుకుంటున్నారు. అది నిజంకాదు... కేవలం అదో సాకు మాత్రమే...! అది కోపం కాదు... ఆత్రం...! ఈ మధ్య... తరచుగా ఇలాచేస్తూ...నే ఉన్నారు. నిన్ననే తీసుకోవటం కాదు. అలవాటు మళ్ళీ నిద్రలేచినట్లవుతోంది...!’’

నిజమా అన్నట్లు మనోరమ ఆశ్చర్యంగా చూసింది. నిశ్శబ్దంగా తలవూపి నిట్టూర్చటమే మహిమ సమాధానం అయింది!

తల్లికీ ఇక తెలిసిపోయిందనే ఉద్దేశ్యంతో కాబోలు అభిరామ్ మరునాడు కూడా బాగా పొద్దుపోయాక తూలుతూ మత్తులో ఇల్లు చేరాడు.

''నిన్నంటే... ఏదో కోపంలో... అలా తాగివచ్చారేమోనని సర్ది చెపుకుని స్థిమితంగా ఉన్నారు పెద్దవాళ్ళిద్దరూ, మళ్ళీ ఈ రోజు కూడా... ఇదేమిటీ...?'' నిలదీసింది మహిమ కోపంగా.

''నాకిష్టమైన అలవాటును నేను... ఎవరికోసం... ఎందుకోసం త్యాగం చేయాలో నాకర్థంకావటంలేదు. నేను నీకు ఏమీ ఆంక్షలు పెట్టటం లేదుగా... మరి నువ్వెందుకు నన్ను కట్టడి చేయాలని చూస్తున్నావు...?''

''మీకు నచ్చని పని... నేనూ ఏమీ చేయటంలేదుగా... అయినా ఎవరికి వారే అనుకుంటే.. ఒకటిగా బ్రతుకుదామని పెళ్ళిచేసుకోవటం ఎందుకు...? పెళ్ళంటే... నేను నుండి మనంలోకి మారటమని మీకూ తెలుసుగా...?'' తీక్షణంగా అడిగింది మహిమ. కంఠం కూడా బొంగురుపోయింది. ఎందుకిలా ఇతను మారుతున్నాడు... తనవల్ల తప్పు ఏమైనా జరిగిందా... ఆమె ఆలోచనకు అంతు చిక్కలేదు.

ఒక క్షణం తర్వాత మహిమ గొంతు సవరించుకుని మెల్లగా అడిగింది ''మీకు... నిజంగా ఇద్దరూ ఆడపిల్లలే అవుతారేమోననే భయం, బెంగ ఉన్నాయా...? ఉంటే చెప్పండి... ఫరవాలేదు... వసు ఒక్కతే చాలనుకుందాం... నేను అబార్షన్... కీ రెడీ...!'' గొంతు గద్గదమైంది మహిమకు. కళ్ళూ తుడుచుకుంది.

''ఏం మాట్లాడుతున్నావు... నాకెందుకూ భయం...? నువ్వు మా అమ్మ చెప్పిన ఆవిడలా ఏడుగురు ఆడపిల్లల్ని కన్నా కూడా బెంగ లేదు... వీరనారిలా వాళ్ళను నువ్వు పెంచి పెద్ద చేయగల సత్తా ఉన్నదానివి కదా... ఇక నాకెందుకూ బెంగ...? వాళ్ళు దేశంమీద పడి... బ్రతికేస్తార్లే...!''

నిర్లక్ష్యంగా అభిరామ్ చెప్పిన సమాధానానికి మహిమకు కోపం బుస్సున పొంగింది.

సమాధానం చెప్పటం అనవసరం అనిపించింది గానీ ఉండబట్టలేక ''ఛీ...ఛీ...'' చీదరగా అంటూ మొహం పక్కకు తిప్పుకుంది.

''నీకు... నేనెలా... కనిపిస్తున్నాను... కుక్కలాగానా... ఛీ... ఛీ... అంటావా....?'' అంటూ విసురుగా చెయ్యెత్తి చెంప ఛెళ్ళుమనిపించాడు!

బిత్తరపోయింది మహిమ. అనుకోని ఆ సంఘటనకు నిర్ఘాంతపోయి చూసింది. మెలకువ వచ్చిన వసుధ కళ్ళు విప్పి చూసి... మళ్ళీ చప్పున దుప్పటి చాటున మూసేసుకోవటం మహిమ గమనించింది. మహిమకు దుఃఖం పొంగుకువచ్చింది. నిగ్రహించుకుంటూ పక్కమీద వాలిపోయింది. ఆ సమయంలో అతనితో వాదన పెట్టుకోవడం మూర్కత్వమేనని మహిమకు ఎపుడో తెలిసివచ్చింది. అందుకే కోపాన్ని అదుపుచేసుకోవటం నేర్చుకుంది.

ఆ తరువాత అతను మామూలుగా ఉన్నపుడు మహిమ అభిరామ్ ని అడిగింది ''ఎందుకు ఇలాంటి మార్పు వచ్చింది మీలో... దీనికీ నేనే కారణం అయితే చెప్పండి. నా ప్రవర్తనను మార్చుకునే ప్రయత్నం చేస్తాను...''

''నువ్వు... నీ కిష్టం అయినట్లు ఉండు... నేనేం నిన్ను మారమని అడగను. అలాంటి అవసరం నాకు లేదు!'' ఖచ్చితమన్నట్లు చెప్పాడు అభిరామ్.

''మనం ఇద్దరం ఓ పాపకి జన్మనిచ్చాం! ఎవరికి వారే అనుకుంటే... తన సంగతి ఏమిటీ...? మిమ్మల్ని చూస్తేనే చాలు... ఎంత భయపడుతోందో... మీకు తెలుసా...?''

''అలా అయితే, హాస్టల్ లో వేద్దామంటున్నావా...?''

మహిమ ఉలిక్కి పడిరది. ''అంత చిన్నదానిని హాస్టల్ లో ఎందుకు వేస్తానంటానూ...! నేను ఉండి... ఏం చేస్తానూ... తండ్రిగా తనని ప్రేమగా చూసుకోవాల్సిన బాధ్యత ఉందని మీకుచెబుతోంటే... నన్నూ దూరం అవమంటున్నారా...?''

మహిమ గొంతు బొంగురుపోయింది.

అభిరామ్ చిరాకు పడ్డాడు. ''నేనేం అనటంలేదు... నీకా ఉద్దేశ్యం ఉందేమోనని అంటున్నా... అంతే...!''

''చిన్నపుడు తనని ఎంత ముద్దు చేసేవారో... ఒక్కక్షణం గుర్తుకు తెచ్చుకోండి. తనకి ఊహ తెలిసే వయసులో భయం కలిగిస్తున్నారు...!'' మహిమ కంఠంలో నిష్ఠూరం తొంగిచూసింది.

''ముద్దుగా ఒక పిల్ల ఉంది కదాని ఇంకొకరు వద్దని నేనంటే... ఎంత రాద్ధాంతం జరిగిందీ...!''

''ఎందుకు కోపం వచ్చిందో మీ కర్థం కాలేదా...? ఎవరైనా ఒకటే ననుకోవాలన్నాంగానీ, మగపిల్లాడు వద్దని అర్థంకాదు! అయినా మన చేతుల్లో లేని దాని మీద మనం తీర్మానాలు ఎలా చేయగలం...?''

అభిరామ్ ఏం మాట్లాడకపోయేసరికి మహిమ మళ్ళీ అంది ''అపుడు ఎవరో తెలియక ముందే, మీరు ఇష్టంగా అమ్మాయేనన్నట్లు ఆనందంగా మాట్లాడేరు... మరిచిపోయారా... పైగా మా అమ్మే మన మధ్యకు వస్తుందంటూ నన్ను వూరడిరచారు కూడా!''

''అవును... అపుడు ఏ క్షణానా ఆ మాట అన్నానోగానీ... నిజంగా ఆవిడే పుట్టినట్లు అనిపిస్తోంది... దానిని చూసినపుడల్లా..! ఇంతంత కళ్ళు పెట్టుకుని నన్నేదో కనిపెట్టి చూస్తున్నట్లు పట్టి పట్టి చూస్తూంటుంది...! మీ అమ్మగారికి మన పెళ్ళి ఇష్టం లేదుగా, అందుకే... నన్ను కట్టడి చేయటానికే కన్నకూతురిగా అవతరించారేమో...?''

అభిరామ్ కొంచెం వ్యంగ్యంగా అన్నా, మహిమకు నవ్వొచ్చింది.

‘‘నిజమే… ముందు అభ్యంతరం చెప్పినా, తరువాత ఇష్టపడిరదిగా… మీరు కూడా ఆనందబాష్పాలే తప్ప అమ్మ కళ్ళనుండి కన్నీళ్ళు రాకూడదని అన్నారు… జ్ఞాపకం ఉందా…?’’

తల్లి జ్ఞాపకాలతో మహిమ కళ్ళు తడి అయ్యాయి.. ‘‘అమ్మ సంతోషంగానే వెళ్ళిపోయింది. ఇపుడు ఉండివుంటే… తన నమ్మకమే నిజమైందని… మీ ప్రవర్తన చూసి ఎంత బాధపడేదో…! ఎందుకు… ఎందుకు మళ్ళీ అలా మారిపోతున్నారు…? నేనేం చేయగలనో తెలియటం లేదు. ఏం చేయమంటారో మీరయినా చెప్పండి…!’’

‘‘నిజంగా… నేను చెప్పేవి రెండు మాటలు పాటిస్తావా…?’’

అభిరామ్ ప్రశ్నకి మహిమలో ఉత్సాహం వచ్చేసింది.

‘‘చెప్పండి… తప్పకుండా చేస్తాను. మా అమ్మకే కాదు, అత్తామామయ్యలకు కూడా నేను చాలా నమ్మకంగా చెప్పాను… మీ పక్కన ఉండి… మీరు… మళ్ళీ పాత దారిలోకి వెళ్ళకుండా నేను చూసుకోగలనని…!’’

‘‘అయితే విను… మొదటిది నువ్వు నీ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలి! టైముకి భోజనం కానిచ్చేయాలిగానీ, నాకోసం ఎదురుచూస్తూ కూర్చోకూడదు. ఆ రోజు… మీ ఇద్దరూ భోజనం చేయకుండా ఎదురుచూస్తూ కూర్చోవటం… నాకెంత బాధగా, చిరాగ్గా అనిపించిందో తెలుసా…?’’

అభిరామ్ మాటలకు మహిమలో ఆనందం పొంగి వచ్చింది. ‘‘ఏం చేయనూ… ఆ రోజు అత్తయ్య మొహం చూస్తే… పలకరించటానికే నాకు జంకుగా అనిపించింది! అంతగా బాధపడటం… నేనెపుడూ చూడలేదు కూడా…! రెండోది ఏమిటీ….’’ హుషారుగా అడిగింది.

అభిరామ్ చిన్నగా నవ్వాడు, ‘‘నాకేది తోస్తే, అది చేసే స్వేచ్ఛ కావాలి! అది వద్దు… ఇది వద్దు… అంటూ నువ్వు రూల్సు పెట్టటం… నాకిష్టం ఉండదు!’’

మహిమ నివ్వెరపోయింది.

మొదటి మాటతో మురిపించి… రెండోదంటూ ఇంతలా దెబ్బతీయటం ఏమిటీ…?

రోషం వచ్చింది. ‘‘మందు అలవాటు అనేది ఆర్థికంగానే కాదు, ఆరోగ్యానికీ చేటు చేస్తుంది…! ఈ మాట గుర్తుచేయటమే, మీ స్వేచ్ఛకు భంగం కలిగించినట్లా…?’’ తీవ్రంగా చూస్తూ కటువుగా అడిగింది మహిమ.

‘‘కాదా…’’ అంటూ నవ్వాడు. “ మానేయ్… అంటూ తేలిగ్గా ఓ మాట చెప్పడం, సలహా ఇవ్వటం చాలా తేలికే! ఎవరైనా ఆపని చేయగలరు! అందులో కష్టం ఏముందీ…! ఒకసారి రుచి చూసి… దానికి ఇష్టంగా అలవాటు పడ్డాక… అపుడు

మానేసిన వాళ్ళ మాటకు, సలహాకు విలువ ఉంటుందిగానీ, నీలాంటి వాళ్ళు చెప్పటం... నేను వినటం... ఏం వీలుకాదు...!''

నిష్కర్షగా చెప్పిన అభిరామ్ సమాధానానికి మహిమకు ఒక క్షణం నోటిమాట రాలేదు. తరువాత నోరు ఎలాగో పెగల్చుకుని... దుఃఖాన్ని అదిమిపెడుతూ అడిగింది... ''రోగికి మందు ఇచ్చే డాక్టరుకి రోగం గురించి తెలిసివుంటే చాలదా... ఆయనా అనారోగ్యాన్ని అనుభవించి... అపుడు ఏ మందులు పనిచేస్తాయో, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో.... చెప్పాలంటే ఎలా...?''

''ఓ... తెలివిగా మాట్లాడతున్నానని అనుకుంటున్నావా...? ఇక్కడ... నువ్వు డాక్టరువీ కాదు... నేను పేషంట్ నీ కాదు... అది గుర్తుపెట్టుకో...!'' అంటూ విసురుగా బయటకు వెళ్ళిపోయాడు.

మహిమ నిర్ఘాంతపోయి రెండు నిముషాలు అలాగే నిలబడిపోయింది.

ఆ తరువాత రెండురోజులకే, మనోరమకు పెద్దమ్మ వరసయ్యే దూరపు బంధువులావిడ అడ్రసు పట్టుకుని వెతుక్కుంటూ వచ్చింది. పెద్దవయసే అయినా తోడు అవసరం లేదంటూ ఒక్కతే వచ్చేసింది. ''ఏం ఉందీ... అక్కడ అబ్బాయి ట్రైను ఎక్కించాడా... ఇక్కడ దిగగానే బోలెడంతమంది ఆటో బంధువులు చుట్టుముట్టి పోటీలు పడి మరీ ఇక్కడకు చేర్చారు...'' అంటూ నవ్వింది.

డాక్టరుకు చూపించుకోవటానికని వచ్చానని చెప్పింది. ఈ మధ్య అనారోగ్యంతో చాలానాళ్ళు మంచంమీదే ఉండి... కోలుకున్నానని, తెలిసిన బంధువుల డాక్టరు దగ్గరకు చెకప్‌కూ, టెస్టులూ చేయించుకోవటానికి వచ్చానంటూ... తన అనారోగ్యం గురించి వివరిస్తూ చెప్పకుండా ఒక్క మాటలో ముగించెయ్యటం మహిమకు ఆశ్చర్యంగా అనిపించింది.!

సాధారణంగా ఆ వయసువాళ్ళు.... తమ అనారోగ్య సంగతులే ఎక్కువగా చెబుతూంటారని మహిమ అభిప్రాయం. చాలా మందినే గమనించింది మరి.

ఈవిడ మాత్రం అలా కాకుండా... బంధువుల సంగతులన్నీ సరదాగా నవ్వుతూ చెప్పుకొచ్చింది. హాస్పటల్ కి కూడా ఒక్కతే వెళ్తానంటే... మనోరమ అంగీకరించలేదు. అభిరామ్ ని సెలవుపెట్టమని చెప్పి... ఆవిడతో పంపించింది.

తను కూడా వెళ్తానని అంటే... మనోరమ ''ఇంతమంది ఎందుకులే...'' అని అంటే, మహిమ ఆగిపోయింది.

ఆమె తీరు బాగా నచ్చి ఆమె పట్ల మహిమకు సదభిప్రాయం ఏర్పడి ఇష్టమూ కలిగింది.

ఆమె పేరు నరసాయమ్మట! ఆవిడ చెప్పే కబుర్లన్నీ మహిమ శ్రద్ధగా వింది. ఆమెకు ఏం రోగాలు ఉన్నాయో తెలీదుగానీ, చక్కగా నవ్వుతూ కబుర్లు చెప్పటం మహిమకు ఆశ్చర్యంగానే ఉంది. అభిరామ్‌ని ఎపుడో చిన్నపుడు చూసిందట. సెలవులకి తమ వూరి తీసుకెళ్ళానంటూ అప్పటి సంగతులన్నీ జ్ఞాపకం చేసుకుందావిడ.

‘‘అపుడు... మా ఇంటికి వచ్చినపుడు... నన్ను నర్సమ్మమామ్మా అని పిలిచేవాడా... ఒక రోజు ‘నువ్వు నర్సమ్మవికదా, తెల్లగౌను వేసుకుని... తలమీద తెల్ల కేప్ పెట్టుకోలేదేం...?’ అనడిగాడు... అందరికీ ఎంత నవ్వొచ్చిందో....!’’

అలా ఏవో అభిరామ్ చిన్నప్పటి సంగతులు సరదాగా చెబుతూనే ఉందావిడ ఇంట్లో ఉన్నంతసేపూ. మహిమనీ దగ్గర కూర్చోబెట్టుకుని... వివరాలన్నీ అడిగి, ఆదరంగా తన కబుర్లూ చెప్పింది. ‘చాలా మంచి అమ్మాయి... మీ కోడలు...’ అంటూ మనోరమ దగ్గిర మహిమ లేనపుడు మెచ్చుకుంది.

అయితే... ఆ తరువాత జరిగిన సంఘటన ఇంట్లో వాళ్ళందర్నీ బాధించింది. హాస్పటల్లో ఆమెకు టెస్టులు జరుగుతున్నపుడు... తొందరగానే వస్తానని పనిమీద బయటకు వెళ్తున్నానని ఆమెకు చెప్పిన అభిరామ్ చాలా సేపటి వరకూ రాలేదట. చాలాసేపు ఎదురుచూసిన ఆవిడ నీరసంగా అనిపించి... ఆటోలో ఇంటికి వచ్చేసింది.

తనని అక్కడ ఒంటరిగా వదిలి వెళ్ళినందుకు కోపం తెచ్చుకోలేదుగానీ, అభిరామ్ ఇంటికి ఇంకా చేరనందుకు చాలా ఆదుర్దాపడిరది.

సాయంకాలానికి ఎపుడో ఇంటికి చేరిన అభిరామ్ ‘ఫ్రెండు కనిపించాడు... అతనికేదో సాయం కావలిసి వచ్చిందీ’ అంటూ కథ చెప్పాడు. మహిమకు మాత్రం అతని తీరు గమనించాక... ఫ్రెండ్ తో బార్‌కి వెళ్ళికాలక్షేపం చేసి వచ్చాడని అర్థమైంది.

పైగా... ఆవిడ హాస్పటల్ లో కట్టటానికని ఇచ్చిన డబ్బు ఖర్చయిపోయిందని ఎటువంటి జంకూ లేకుండా చెప్పటం... మనోరమకు కోపం తెప్పించింది.

నిరంజన్ వెళ్ళి డబ్బు కట్టి వచ్చాడు, తల్లికోపం, మహిమ నిరసన చూసి చిరుబుర్రులాడాడు. ‘‘ఏదో ఘోరం జరిగిపోయినట్లు... అలా చూస్తారేమిటీ...? హాస్పటల్ తమ బంధువులదేనని ఆవిడే చెప్పిందిగా, ఒకరోజు ఆలశ్యంగా పే చేసినందువల్ల... ఏమయిందీ...!’’ అనేసరికి మనోరమ ‘‘ఏమయిందా... పరువు పోయింది!’’ అంటూ రుసరుసలాడిరది.

ఆవిడ ఇంట్లోనే ఉంది కాబట్టి మనోరమకీ గట్టిగా మాట్లాడే అవకాశం లేకపోయింది. మరునాడు నిరంజన్ ఎవరినో పిలిపించి... ఆమెను ట్రైను ఎక్కించే ఏర్పాటు చేశాడు. ఆమెకూ అసలు విషయం తెలిసిందో లేదో గానీ, ఆమె మాత్రం తెలియనట్టే ప్రవర్తించింది. ‘ఏదో అర్జంటు పనిమీద వెళ్ళాడు కాబట్టి ఆలశ్యం అవుతుందిలే అనుకుని సమాధానం పడ్డా, మనసులో ఓ మూల బితుకు బితుకు మంటూనే ఉన్నాను... భగవంతుని దయవలన బిడ్డ క్షేమంగానే చేరాడు. ఈ రోజుల్ని బట్టి... ఇలాంటి అనవసర భయాలు వేధిస్తూంటాయి!’’ అనుకుంది తనలో తాను అనుకుంటున్నట్లు.

ఆమె వెళ్ళాక నిరంజన్ కూడా అభిరామ్ మీద విరుచుకు పడ్డాడు.

‘‘డబ్బు కనిపిస్తే చాలన్నమాట... బార్‌కి పరుగు పెట్టేస్తావా... ఆ పెద్దావిడ హాస్పటల్‌లో కట్టాలని ఇచ్చిన డబ్బును కూడా అలా తగలెయ్యటానికి నీకు సిగ్గనిపించలేదా... అంతలా దిగజారిపోయావా...?’’

‘‘ఇపుడు ఏమైందీ... ఒక రోజు ఆలశ్యంగా బిల్ పే చేయటం అయింది. అంతేగా... ఆపైన ఆ హాస్పటల్ వాళ్ళ బంధువులదేనని ఆవిడ చెప్పింది కూడా కదా...!’’

అభిరామ్ నిర్లక్ష్యంగా  ఇచ్చిన సమాధానానికి ఆయనకు కోపం మరింత పెరిగింది.

‘‘బంధువుల హాస్పటల్ అయితే... ఎపుడు కట్టినా ఫరవాలేదా...? అసలావిడ ఏమనుకుని

ఉంటుందీ... ఇదెంత చిన్నతనమో నీ కర్థం కావటం లేదు... అదే నా బాధ...!’’ ఆయన తల పట్టుకున్నాడు.

‘‘మీ బాధ ఏమిటో నాకు బాగానే అర్థమవుతోంది. వేరే చెప్పనక్కర్లేదు! రెండు రోజులలో మీ డబ్బు మీకిచ్చేస్తాను! అరకొర జీతం డబ్బులతో నేనెంత అవస్థపడుతున్నానో తెలుసుకోకుండా... నీతులు మాత్రం చెబుతున్నారు! రిటైరయ్యాక వచ్చిన డబ్బులో కొడుకుగా నాకు పైసా అయినా ఇచ్చారా...? అసలు మీకు... క్రమశిక్షణ, నీతి నిజాయితీలకు మారుపేరైన ఆఫీసరుగా పేరు తెచ్చుకోవాలన్న మోజులో రవ్వంతయినా కన్నకొడుకు మీద ప్రేమ లేనేలేదు...!’’

ఆ మాటలకు నిరంజన్ రావు నిర్విణ్ణుడైపోయాడు.

గుమ్మం దగ్గిర మనోరమ, మహిమ కూడా అలాగే నిలబడిపోయారు.

ఆయన ఆవేశం ఆపుకోలేక... స్వరం పెంచి... మందలిస్తున్నట్లుగా అన్నాడు. ‘‘నీకసలు బుద్ధీ, జ్ఞానం ఉన్నాయా...? చెట్టంత ఎదిగిన వాడివి... నా చేత ఖర్చుపెట్టించింది... అదీ తాగుడికి... చాలక పైగా నీకు నా రిటైరయ్యాక వచ్చిన దానిలోనుండి కూడా వాటా ఇవ్వలేదని అంగలారుస్తున్నావా...?!’’

‘‘అవును... ప్రేమను, డబ్బును ఏదీ పంచి ఇచ్చే అలవాటు లేదుగానీ, దండిరచటానికి అవకాశం వస్తే మాత్రం చాలు... జులుం చూపించేస్తారు...”  విసుక్కుంటూ తనగదిలోకి వెళ్ళి భళ్ళున తలుపు వేసుకున్నాడు అభిరామ్.

కాసేపటి తర్వాత.... మెల్లగా లోపలకు వచ్చింది మహిమ.

ఏం మాట్లాడాలో తోచనట్లు అటూ ఇటూ చూస్తూండి పోయింది.

తరువాత ‘‘మీకెందుకంత కోపం వచ్చిందీ... పెద్దవాళ్ళని గౌరవించినట్లుగా మీ అభిప్రాయం ఏదైనా మామూలుగా, మెల్లగా చెప్పొచ్చుకదా...?’’ అంది.

‘‘నేను తప్ప ఈ ఇంట్లో ఎవరు ఎవరికైనా నీతులు చెప్పొచ్చు! నువ్వే కాదు, ఇక ఆ చిన్నది కూడా నాకు మంచీ చెడూ అంటూ చెప్పటం మొదలుపెడుతుందేమో...! ఇప్పటికే... నా వైపు కళ్ళు పెద్దవి చేసుకుని... మిర్రి మిర్రి చూస్తుంటుంది...!’’

‘‘అది కోపం కాదు.. మీరంటే... బాగా భయం ఏర్పడిపోయింది! మునుపేమో నాన్న ఎపుడు వస్తారంటూ ఎదురుచూస్తూ కూర్చునేది... ఇపుడేమో... మిమ్మల్ని చూసి పరుగెత్తి వెళ్ళిపోయి దాక్కుంటోంది...!’’ మహిమ నిట్టూర్చింది.

ఒక క్షణం ఆగి ‘‘అసలు చెబుదామని అనుకున్న విషయం మర్చేపోయాను. నేనూ ఏదో ఒక

ఉద్యోగం చూసుకుందామను కుంటున్నాను...’’ అంది మహిమ సంకోచంగా.

‘ఎందుకనీ’ అన్నట్లుగా చూశాడు అభిరామ్.

‘‘ఇంటి అద్దె ఒక్కటే లేదుగానీ... చాలా ఖర్చే అవుతూంటుంది. భారం అంతా పెద్దవాళ్ళమీదే వేయటం సమజంసంగా అనిపించటం లేదు. నేనూ ఉద్యోగం చేస్తే... నాకు కాలక్షేపంగానూ

ఉంటుంది. కొంత ఖర్చు మనమూ భరించినట్లు ఉంటుంది కదా...!’’

అభిరామ్‌కి కోపం వస్తుందేమోనన్నట్లు కొంచెం బెదురుగా చూసింది.

ఒక క్షణం ఆలోచనలో పడినట్లు మౌనంగా ఉండిపోయిన అభిరామ్ ‘‘నాకూ అదే మంచిదిగా అనిపిస్తోంది.. మనకూ ఖర్చులు పెరుగుతున్నాయి... రేపటినుండీ కారు కూడా వస్తుంది...!’’ అన్నాడు.

అతను అంత సులువుగా అంగీకరిస్తాడని అనుకోని మహిమ ఉత్సాహంగా ఏదో చెప్పబోయిందిగానీ, చివరి మాటతో ఉలిక్కిపడి ‘‘కారా... కారు... ఏమిటీ... కొంటున్నారా...?’’ అంది ఆశ్చర్యంగా.